
దాదాపు పది సంవత్సరాల తరబడి స్వంతూరు విజయనగరం మొహం చూడ్డానికే కుదరని ఉద్యోగం అయిపోయింది నాది. ప్రమోషన్ పేరుతో పెద్ద పదవికి శ్రీకారం చుట్టాలన్న ఆపేక్ష నాకయితే లేకపోవచ్చును గాని... అమ్మ నాన్నల ఒత్తిడివల్ల బదిలీ అయి గోదావరి ఖని వెళ్ళిపోవలసి వచ్చింది.



మళ్ళీ ఇంతకాలం తర్వాత వీలు చిక్కించుకుని బయలుదేరాను. చిన్నప్పటి నుండీ నా ఏకైక ప్రాణమిత్రుడు ఫణి ప్రకాశం. ఎప్పుడూ వాడి గురించేనే ఎక్కువగా ఆలోచిస్తుంటాను. ఉత్తరాల ద్వారా వాడొక మంచి వ్యాపారస్తుడిగా మారినట్లు మాత్రం అవగతమైంది.

రైలులో ప్రయాణిస్తున్నా ఫణి ప్రకాశం గురించిన ఆలోచనల్లోనే పయనిస్తున్నాను నేను.

వాడెలా వున్నాడో?! ముఖ్యంగా వాడి రచనా వ్యాసంగం!! నేను ఆ రోజుల్లో విరివిగా కథలు వ్రాసేవాడిని... ఏ వేళా విశేషమో కాని నేను మొదలెట్టిన నాటినుండీ నా రచనలు బాగానే అచ్చేసాయి పత్రికలు. అదే రోజుల్లో నాతో పోటీకి అన్నట్లుగా ఫణిప్రకాశం రచనా వ్యాసంగం ముమ్మరంగా సాగించినా ఎడిటర్ గారికి ఏసుగెత్తే వాడి దురదృష్టమో కాని గోడకొట్టిన బంతుల్లా యిమ్మిడియేట్ గా రిజక్ట్ అయిపోతుండేవి!

అయితే ఈ మధ్యకాలంలో మరి ఏదయినా కలంపేరు గాని పెట్టుకుని ఓ ఊపు వూపుతున్నాడేమో తెలియదాయె!?

విజయనగరం నేలపై అడుగు పెట్టిన ఆ క్షణం చెప్పలేని మధురానుభూతి హృదయంలో నిండింది.

కవి, పండితులున్న, ముఖ్యంగా

# 'గుర్తింపు'

## కె.కె.రఘునందన

గురజాడవారి కవితాగానం వినదించిన పరిసరాలలో కాలిడితే వాగ్గర్వమే మరి!

అందుకే నాకా కథ వ్రాసినా గొప్పో కొద్దో, నేను విజయనగరం వాడ్నని ఘంటా మ్రోగించినట్లుగా చెప్పుకోవాలని ఈ పరిసరాలనే ప్రస్తావిస్తాను.

నన్ను నేను మైమరిచి, రిక్షావాడి పిలుపుతో యిహంలోకి అడుగుపెట్టాను.

గురజాడ వీధిలో రిక్షాదిగి ఫణిప్రకాశం యింటివైపు నడిచాను. కె.వి. రామారావు గారి అనువ్రతి ప్రక్కనుందే వాడిది. నేవెళ్ళేసరికి... ఫణిప్రకాశం ఏవో కాగితాలతో కుస్తీ పడుతున్నాడు.

నారాక చూస్తూనే ఫైల్లోకి కాగితాలని గబగబ తోసేసాడు. "ఏరా! లవ్‌లెటర్‌గాని కాదుకదా! నేరాగానే దాచేస్తున్నావు!" అన్నాను పలకరింపుగా ఏదో అనాలని.

"ఈ మొద్దు మొహాన్ని ప్రేమించే అమ్మడింకా ఈ విజయనగరంలో పుట్టలేదు గురూ! ఇంతకీ యిదేనారాక" అని నవ్వి క్షేమం అడిగాడు ఫణిప్రకాశం.

తర్వాత కాఫీ తెప్పించాడు.

తనింకా 'బ్రహ్మచారి శతమర్కటం.' అన్న సూత్రాన్ని రుజువు చేస్తున్నానని సాహితీ పరంగా మాలయంలో ఎదిగానని చెప్పాడు.

మొదటి విషయంకి పెద్ద ఆశ్చర్యపోకపోయినా రెండో సంగతికే కళ్ళు పెద్దవి చేస్తూండి పోయాను.

"అంటే నువ్వేదయినా కలంపేరుతో గాని కథలు వ్రాస్తున్నావా! అడిగాను. సందేహం తీరక.

"నా పలుకుబడి, పేరు ప్రఖ్యాతులు, ఎంత పెరిగాయో నీ కళ్ళారా నువ్వే చూస్తావుగా... సాయంత్రం నాతో రా తెలుస్తుంది." గర్వరేఖ వదనంలో తళుక్కుమంది.

అలాగేనని ఆ సాయంత్రం దేవీ విలాస్‌లో టిఫిన్ లాగించేసి శంకర కల్యాణమండపం కెళ్ళాం.

బయట 'వ్యసన... జీవన' సాహిత్య సంస్థ అన్న బ్యానర్ వ్రేలాడుతోంది.

ఓ సాహితీ సంస్థకి ఆ పేరే వుద్దేశ్యంతో పెట్టారో అర్థం కాలేదు.

అదే అడిగాను.

"ఇంత పెద్ద రచయితవైవుండి బోదటళ్ళేదా గురూ! సాహిత్యం అనేది రచయితకి వ్యసనంగా మారి చివరికి అదే జీవితంగా భావించాలని... సంకేతంగా ఆ పేరుపెట్టాం." అని ఓ బోడి స్టేటుమెంట్ విసిరాడు.

లోనికి నడిచాం.

చాలా మంది పోగయినారక్కడ.

అంతా ఫణిప్రకాశాన్ని చూస్తూనే చుట్టుముట్టారు. ప్రతీవారికీ ఓ షేక్‌హాండ్, ప్లస్ ఓ చిరునవ్వు పారేస్తున్నాడు.

ఎవరినోట విన్నా వాడి ప్రసక్తే.

రచయితగా యింతకాలంగా నాకు లేని ఫాలోయింగు వీడికెలా వచ్చిందో!

నన్ను అందరికీ పరిచయం చేసాడు. అడపా దడపా నా కథల్ని చదివే పాఠకులు సైతం అందులో వుండటంతో నా ఉనికి కూడా నిలద్రొక్కుకుంది.

ఆ గుంపులో పద్యాలు వ్రాసినవారు, కవితలు చదివే బాపతులే కాని, కథ, కాకరకాయ అంటూ నాలా దేవుళ్ళాడేవాడు వాక్కనపడ్లేదు.

హాల్లోకి టీలు, బిస్కట్స్ వచ్చాయి.

అపుడు అచ్చం రోడ్డువార హోటల్‌లాగే వుంది.

అబోతుల్లా బిస్కెట్స్‌కోసం ఎగబడి సంస్కారం మరచి నాలుగేసి చేత్తో తాగేసుకుని... టీలు చప్పరించే సరుకు ఎక్కువయిందక్కడ. తర్వాత ఎవరి సీట్లలో వాళ్ళు సర్దుకున్నారు.

వేసూాను!!

ఫణిప్రకాశం మైకుముందు నిల్చుని అందరికీ వందనాలు తెలియపరచి... ఆ ఊర్లో బాగా పేరుమోసిన, రేపోవడపో తెలియపరచి ముసలి ప్రాణిని అధ్యక్ష పీఠం అలంకరించవలసిందిగా కోరాడు.

ముఖ్య అతిథిగా... ఎంత తిన్నా ఎముకల పోగుతప్ప కొంచెం కూడా మాంసంలేని మరోకాయన్ని పిలిచాడు.

తర్వాత ఫణిప్రకాశం ప్రసంగిస్తూ "ఈ రోజు నా మిత్రుడు రచయిత అయిన కేదార్‌నాథ్‌ని వేదిక నలంకరించ వలసిందిగా కోరుతున్నాను. నన్ను యిరికించాడు.

మరో మాటకి తావులేకుండా వచ్చినట్లు వాడు చూపించిన సింహాసనం అధిష్ఠించవలసి వచ్చింది.

పాపం! ఆ అధ్యక్షులవారు నిలబడలేక, నిముడలేక నిలబడి మైకు పట్టుకుని వణికే చేతుల్తో వూపేస్తూ, "చిరంజీవి" అంటూ మొదలెట్టి నా గురించి తనకు తెల్సిన నాల్గువాక్యాలు చెప్పటాన్కి గంట పట్టింది.

తర్వాత ఛాన్స్ నాదే!

క్లానీ అయిదు నిముషాలలోనే సుత్తి కొట్టకుండా ముగించాను. మిగిలిన సమయంలో ఏవేవో పేర్లు పిలిచాడు ఫణి. ఏభైఏళ్ళ ముసలివారి వద్దనుంచి, చెడ్డీలు తొడుక్కునే కుర్రకుంకలుదాకా ఏవేవో కవితలు, పద్యాలు తెచ్చి ఓ రెండుగంటలపాటు, చదివిన వాక్యాన్నే చదువుతూ మైకదిరిపోయేలా దంచారు.

ప్రతి కవితకీ ఎముకల పోగు వాఖ్యానం ఒకటి!!

ఎవరికెలా వుందో నాకు తెలీదుకాని నా బుర్రమాత్రం పేలిపోయేంత వేడెక్కిపోయింది.

రెండు స్ట్రాంగు టీ... నాల్గు ఎనాసిన్ బిళ్ళలు అర్జంటుగా కావల్సొచ్చాయి.

ఆమె కాసురుళ్ళ బారినుండి బయటపడేసర్కి రాత్రి పదకొండయింది.

"చకోవ్‌లకి డబ్బు విచ్చాలుండు" అన్నాడు చివరిగా.

"చకోవ్ లెవరోయ్! 'చకోల్'లా గొప్ప కథకులా... విడ్డూరంగా అడిగాను.

"కాదోయ్! 'చ.కొ.వా'లంటే చప్పట్లు కొట్టేవాళ్ళు. ప్రతీదానికీ చప్పట్లు కొట్టే బృందం ఒకటి ఏర్పాటు చేసాను. వాళ్ళకి డబ్బులిచ్చి వస్తానుండు" అని వెళ్ళి అయిదు నిముషాల్లో వచ్చాడు.

"నీ సంస్థ కాదు కాని నా బుర్ర అగ్ని పర్వతమైపోయిందిరా! వాళ్ళబార్టీలు నెత్తిమీంచి కుమ్మరించుకుంటే కాని తగ్గేలాలేదు" ఇంటికెళ్ళాక విసుగ్గా అన్నాను.

"నీ బుర్ర వేడి తగ్గడాన్కి 'కల్యాణీ బీరుం'ది గురూ!" అంటూ కార్క్ వూడదీసి నా ముందర బీరు సీసాపెట్టాడు.

"అయినా నీకెందుకు వెర్రి తాపత్రయం... మీ అందర్నీ చూస్తే ఒక గన్‌లో షూట్ చేయాలనిపిస్తోంది... మీ వాళ్ళందరూ గంటలకొద్దీ మైకు వదలరేం!"

"ఔను నీకు తాచికాగ్గా ఉంటుంది కాని నా తాపత్రయం దేనికో నీకింకా అర్థం కాలేదు."

"దేనికి"

గుర్తింపుకోసం... మనిషన్నాక ఏదో విధంగా గుర్తింపు పొందాలి. అదెలా... ఓ రచయితగా స్థానం సంపాదించాలంటే పత్రికల్లో ప్రచురణ అవ్వాలి... అపుడెలా చెప్పకపోయినా గుర్తింపు వస్తుంది...ఉదాహరణకు నీలాగ... కాని నాలాంటివాడికో... నా కథలు ఏ పత్రికల్లో పడ్డంలేదు. మరెలా నా గురించి అందరికీ తెలుస్తుంది... అందుకే యిటువంటి సంస్థ నొకదాన్ని స్థాపించాం. అదృష్టవశాత్తూ ఇందులో చేరిన వాళ్ళంతా పత్రికల్లో ప్రచురణకి నోచుకోని అభాగ్యులే! కాబట్టే నా మాట చెల్లుతోంది. ఫండ్‌కూడా బాగా ముడ్తుంది. పేరుకి పేరు... డబ్బుకి డబ్బు..." అని సవిస్తరంగా చెప్పాడు ఫణిప్రకాశం.

వాడి గుర్తింపుకోసం పవిత్రమైన సాహితీసంస్థలకి ఎంత మచ్చ తెస్తున్నదీ అర్థం అయింది.